

సెల్ఫీ విత్.. 'మా ఇంటి మట్టి గణపతి'

పర్యావరణాన్ని కాపాడుతూ.. భక్తి భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా 'సాక్షి' సెల్ఫీ విత్ 'మా ఇంటి మట్టి గణపతి' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇంటిలో ప్రతిష్ఠించిన ప్రతిమతో సెల్ఫీ దిగి, పేరు, చిరునామాతో వాట్సప్ ద్వారా పంపించాలి. మీరు పంపిన ఫొటోలు సాక్షి దినపత్రికలో ప్రచురితమవుతాయి. ఫొటోలు పంపించాల్సిన వాట్సాప్ ఫోన్ నంబర్లు

90597 75328, 89855 54525

-మెదక్ కలెక్టరేట్

న్యూస్‌రీల్

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ



జగ్గంపేటలో భవజ్ఞకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

చిలప్‌చెడ్(నర్సాపూర్): జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ (అండర్ 12) స్పారింగ్ విభాగంలో చిన్నారి బంగారు పతకం సాధించింది. చిలప్‌చెడ్ మండలం జగ్గంపేటలో గల నవభారతి పాఠశాలలో 4వ తరగతికి చెందిన నీరుడి భవజ్ఞ మేడ్చల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయస్థాయి అండర్ 12 స్పారింగ్ విభాగంలో బంగారు పతకం గెలిచింది. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది చిన్నారిని ఘనంగా సన్మానించింది. తర్వాత బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని మరోసారి తమ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్‌తో శారీరక, మానసిక దృఢత్వం సాధించవచ్చన్నారు. చిన్నవయసులో బ్లాక్‌బెల్ట్ సాధించడంతో పాటు, పలు జాతీయస్థాయి పోటీల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించడం హర్షణీయమన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ



మున్సిపల్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కమిషనర్ రామకృష్ణారావు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా డాక్టర్ రామకృష్ణారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించే ముందు మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్‌ను ఆయన ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. గతంలో ఇక్కడ పని చేసిన జైతురామ్ నాయక్ బదిలీపై వెళ్లడం ఆ స్థానంలో ఈయన ఇక్కడికొచ్చారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న విద్యార్థినులకు కరాటేలో శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన శిక్షకులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రాధాకిషన్ గురువారం తెలిపారు. జిల్లాలోని 191 పాఠశాలల్లో రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్–స్వీయరక్షణ కార్యక్రమం కింద మూడు నెలలపాటు బాలికలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల కరాటే మాస్టర్లు ఈనెల 10వ తేదీ సాయంత్రం లోపు మెదక్ కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. సమాచారం కోసం డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చార్మినార్ జోన్‌లోకి మార్చాలి




ఎమ్మెల్సీకి వినతి పత్రం జేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

మెదక్ కలెక్టరేట్: మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లోకి మార్చాలని ట్రేసా ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గురువారం మెదక్ కలెక్టర్‌లో జరిగిన టీచర్స్ డేలో పాల్గొనేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ట్రేసా ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆయన్ను కలిసి జిల్లా సిరిసిల్లా జోన్‌లో ఉండటంతో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. వెంటనే చార్మినార్ జోన్‌లోకి మార్చేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు భద్రత కరువు

బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వీణ



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నేతలు

మెదక్‌జోన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మహిళలకు భద్రత కరువైందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బెండ వీణ పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లో గిరిజన మహిళపై జరిగిన లైంగిక దాడి, హత్యాయత్నంకు నిరసనగా గురువారం మెదక్‌లో మహిళా మోర్చా ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన మహిళపై లైంగిక దాడి చేసి హత్యాయత్నం చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సంగీత, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి గురువులే కీలకం

- కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి
- కలెక్టరేట్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

మెదక్ కలెక్టరేట్: సమాజ నిర్మాణానికి గురువులే మూలమని, ప్రతీ ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అయినప్పుడే నాణ్యమైన బోధన లభిస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. గురువారం మెదక్ కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రసంగించారు. గురువు అంటే మార్గదర్శి, నిపుణుడని కొనియాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని మనం ప్రతీ సంవత్సరం ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన జీవితాన్ని అందరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మనందరిని చైతన్య పర్చిన, మనకు జీవన పాఠాలు నేర్పిన గురువులను స్మరించుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలలో కాంతి చూపించే దీపం గురువన్నారు. వారి మార్గనిర్దేశం మన బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునే శక్తిని ఇస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు నేర్పించే వారే కాక మంచి విలువలు, ఆలోచనలు, జీవితంలో విజయవంతానికి కావలసిన మార్గాలను కూడా నేర్పిస్తారని చెప్పారు. అనంతరం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపికైన 53 ఉపాధ్యాయులకు మెమెంటోలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా విద్యాధికారి రాధాకిషన్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ముమ్మరం

- గతనెల 15 నుంచే మొదలు
- ఈనెల 13న పంచాయతీల్లో ప్రచురణ
- 18న రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టర్ సమావేశం
- తుది జాబితా 28న

గ్రామపంచాయతీ ఎన్నికల కోసం నూతన ఓటర్ల జాబితా సిద్ధం అవుతోంది. ఇప్పటికే బీఎల్‌ఓలు విధులను నిర్వర్తిస్తున్నారు. నూతన ఓటర్లు అంతా వారివారి వార్డుల్లో కుటుంబాలతో కలిసి ఒకే బూత్‌లో ఓటు వేసేలా అధికారులు యత్నం చేస్తున్నారు. వివాహాలు చేసుకుని వెళ్లిపోయిన యువతి, చనిపోయిన వారి పేర్లు గుర్తించి తొలగిస్తున్నారు.



జంగారాయి పంచాయతీ కార్యాలయం

మెదక్‌జోన్: మెదక్ జిల్లాలోని 469 గ్రామ పంచాయతీల్లో 4,293 వార్డులు ఉన్నాయి. ఓటర్లు 5,15,753 మంది ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు 2024 జనవరి 1న ఫైనల్ జాబితా ఆధారంగా బీఎల్‌ఓలు, ఇతర సిబ్బంది నూతన లిస్ట్ తయారు చేస్తున్నారు. కాగా ఓటర్ జాబితా, ఇతర అంశాలపై తీసుకోవాల్సిన అంశాలపై జులైలోనే బీఎల్‌ఓలకు ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో శిక్షణ ఇచ్చారు. దీంతో 20 రోజులుగా బీఎల్‌ఓలు, పంచాయతీ, అంగన్‌వాడీలతో కలిసి వారు వార్డులవారీగా జాబితా తయారీలో నిమగ్నమయ్యారు. దీంతో ఒక కుటుంబంలో ఉన్న ఓటర్లంతా ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలోని జనాభా ఆధారంగా వార్డులను విభజించే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే పెళ్లయి వెళ్లిపోయిన యువతులు, చనిపోయిన వారి పేర్లు లిస్ట్ నుంచి తొలగిస్తున్నారు.

కొత్త ఓటర్లకు అవకాశం

18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఆన్‌లైన్ ద్వారా ఓటు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం ఏడాదికి 4 సార్లు అవకాశం కల్పిస్తోంది. వారి మెమో లేదా బోనాఫైడ్ ఆధారంగా ఆన్‌లైన్‌లో ద్వారా ఓటు నమోదు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వచ్చే జనవరి వరకు కొత్త వారు ఓటు నమోదుకు అవకాశం ఉంది. కొత్త ఓటరుగా నమోదైన వారి జాబితా ఆధారంగా ఆ కుటుంబాలు ఏయే వార్డులో ఉన్నాయో గుర్తిస్తారు. తర్వాత అందులో వారి పేర్లు చేరుస్తారు. దీంతో ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

18న రాజకీయ పార్టీలతో సమావేశం

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని పార్టీల రాజకీయ నాయకులతో ఈనెల 18న కలెక్టర్ సమావేశం నిర్వహించనున్నారు. ఎన్నికల, ప్రచారం, నిర్వహణ తీరుపై పార్టీ నాయకులకు కలెక్టర్ వివరిస్తారు.

రిజర్వేషన్లపై వీడని ఉత్కంఠ

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు విడుదలైనా ఎలక్షన్ జరిపించేందుకు ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నారు. కానీ రిజర్వేషన్ల పీటముడి ఇంకా వీడనే లేదు. గత ప్రభుత్వం 10 ఏళ్లకు సంబంధించి సర్పంచ్‌ల రిజర్వేషన్ ఖరారు చేసింది. ఆ ప్రభుత్వ పాలనలో సర్పంచ్‌ల పదవి కాలం ఐదేళ్లు గడిచిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం నాటి రిజర్వేషన్లను రద్దు చేసి కొత్త రిజర్వేషన్లను ఖరారు చేస్తుందని అధికార పార్టీకి చెందిన పలువురు నేతలు పేర్కొంటున్నారు.

ఫిర్యాదుల స్వీకరణ

శుక్రవారం నుంచి ఓటరు జాబితాపై ఫిర్యాదులను స్వీకరించనున్నారు. అనంతరం చేర్పులు మార్పుల తర్వాత ఈనెల 13న ఆయా పంచాయతీల్లోని నోటీసు బోర్డుల్లో అందుబాటులో అంటిస్తారు. 28న తుది జాబితా విడుదల చేస్తారు. ఆగస్టు 15 నుంచి దానిని సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఆశావహుల ఎదురుచూపు

సర్పంచ్‌లుగా పోటీ చేసే ఆశావహులకు ఎదురుచూపులు తప్పటంలేదు. రిజర్వేషన్ అనుకూలంగా వస్తే పోటీ చేసే అవకాశం తనకే కల్పించాలని నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మాజీ సర్పంచ్‌లు సైతం మరోసారి అవకాశం వస్తే బరిలో ఉంటామని అంటున్నారు. గ్రామ ఓటర్లను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి



ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): ఉపాధ్యాయ సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం కోరారు. గురువారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను తన నివాసంలో రాష్ట్ర అధ్యక్షుడితో కలిసి ఆయన వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయ రంగ సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని, ఏళ్ల తరబడి ఒకే పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయడం లేదన్నారు. కొత్త నియామకాలు జరిగే వరకు తాత్కాలికంగా వారి స్థానాల్లో ప్రత్యేక టీచర్‌లను నియమించి బదిలీ అయిన వారిని వెంటనే రిలీవ్ చేయాలన్నారు. అలాగే వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో ప్రాథమిక పాఠశాలలను బలహీనపరుస్తున్న చర్యలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని కోరినట్లు తెలిపారు. దీనికి కోదండరాం సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

మొరాయించిన ఎస్‌బీఐ సర్వర్‌లు



బ్యాంకు ఎదుట గుమిగూడిన వినియోగదారులు

తూప్రాన్: పట్టణంలోని ఎస్‌బీఐ ఆన్‌లైన్ బ్యాంకు సర్వర్‌లు గురువారం మొరాయించగా అధికారులు బ్యాంకుకు తాళం వేశారు. దీంతో పని నిమిత్తం ఇక్కడికి వచ్చిన రైతులు, ఖాతాదారులు ఆందోళనకు దిగారు. గత నెల రోజులుగా పంట రుణాల కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా బ్యాంకు అధికారులు రేపు, మాపు అంటూ బ్యాంకు చుట్టూ తిప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరా గురువారం బ్యాంకుకు వస్తే నిరాశే మిగిలిందన్నారు. సర్వర్‌లు పని చేయడం లేదని బ్యాంకు గేటుకు తాళం వేసి సూచిక బోర్డు ఏర్పాటు చేశారని వాపోయారు. అధికారులు స్పందించి తమకు సకాలంలో పంట రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మమ్మల్ని తొలగించడం అన్యాయం

కలెక్టరేట్ ఎదుట పార్ట్‌టైం టీచర్ల నిరసన



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పార్ట్‌టైం ఉపాధ్యాయులు

మెదక్ కలెక్టరేట్: ఎంతో అంకిత భావంతో పని చేస్తూ విద్యార్థులకు బోధన చేస్తున్నామని, అకారణంగా మమ్మల్ని తొలగించడం అన్యాయమని పార్ట్‌టైం టీచర్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం మెదక్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న తాము రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విద్యార్థులకు బోధన చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలు లేకున్నప్పటికీ తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరాలోచించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్.. ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్తానని హామీనిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్ట్ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శ్రీనివాస్, అనంద్, స్వప్న, మహేశ్‌కుమార్, రవి కుమార్, శైలెందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి ధర్మారంగా పేరు మార్పు

గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం

రామాయంపేట(మెదక్): మండలంలోని దొంగల ధర్మారం గ్రామస్తుల చిరకాల కోరిక నెరవేరింది. ఈ మేరకు గ్రామం పేరు మార్చాలని ఇచ్చిన వినతులకు కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించింది. ఎట్టకేలకు గ్రామం పేరు మారుస్తూ గెజిట్ విడుదల చేసింది. దీంతో గ్రామస్తులు సంతోషం వెలిబుచ్చారు. ఈ విషయమై గతంలో దుబ్బాకకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడం తెలిసిందే.

గర్భిణులు పేరు నమోదు చేసుకోండి

జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ

అల్లాదుర్గం(మెదక్): అంగన్‌వాడీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మాజీ అన్నారు. గురువారం మండల పరిధిలోని గడ్డిపెద్దాపూర్‌లో నిర్వహించిన పోషణ్ మాసోత్సవంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఇక్కడి టీచర్‌లు ఇచ్చే సూచనలు సలహాలను పాటించాలని చెప్పారు. పోషకాహారం తీసుకుంటూ డెలివరీ అయ్యే సమయానికి సరైన బరువు ఉండేలా చూసుకోవాలన్నారు. బాలింతలు కూడా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, పిల్లలకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. అలాగే బరువు తక్కువగా ఉన్న పిల్లలకు బాలామృతం తినిపించాలన్నారు. ప్రతీఒక్కరు పరిశుభ్రతను పాటించాలన్నారు. సీడీపీఓ పద్మలత, సూపర్‌వైజర్ నాగమణి, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయ కర్త వెంకట్, అన్నారం మెడికల్ సూపర్‌వైజర్, పంచాయతీ సెక్రటరీ, గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

'ఆశ'లకు కనీస వేతనం రూ.26 వేలు

- ఆరోగ్య బీమా, పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర సౌకర్యాలకు డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా, అధికారులకు వినతులు

మెదక్ కలెక్టరేట్: ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, అధికారుల వేధింపులు ఆపాలని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు నర్సమ్మ డిమాండ్ చేశారు. గురువారం మెదక్ కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లతో కలిసి ఆమె ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీరామ్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశా ఆలిండియా పిలుపులో భాగంగా ఆశా యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టినట్లు తెలిపారు. 20 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని, శ్రమ దోపిడీకి గురవుతున్నారని మండిపడ్డారు. ప్రజలకు అందుబాటులో ఉండి అనేక సేవలు అందిస్తున్నా చిన్నచూపు చూడటం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. వారు గ్రామాలలో లేకపోతే పేదలకు సక్రమంగా ఆరోగ్య సేవలు అందవని పేర్కొన్నారు. తమ ప్రాణాలకు తెగించి సేవలు అందిస్తున్నప్పటికీ ఆరోగ్య బీమా, పీఎఫ్, ఈఎస్ఐ , ప్రమాద బీమా సౌకర్యం ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నిబంధనల ప్రకారం వెయ్యి మందికి జనాభాకు ఒక ఆశావర్కర్ ఉండాలని, కాని మూడు వేల మందికి ఒకరే విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పథకాన్ని అమలు చేసినా వారి ఆధ్వర్యంలోనే సర్వేలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనం రూ.26 వేల వేతనం చెల్లించాలని, పీఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం, ఉద్యోగ భద్రత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని, వెంటనే ప్రభుత్వం స్పందించి వాటిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు సబిత, చంద్రకళ, రాములమ్మ, పెంటమ్మ, దుర్గా, లక్ష్మి, సుశీల, పద్మ, లక్ష్మి, మంజుల, రాణి, అనసూయ, శ్యామల, వసంత పాల్గొన్నారు.

తయారీదారులకు ప్రోత్సాహమేదీ?

- మూడేళ్లపాటు జిల్లాలో మట్టి వినాయక ప్రతిమల సరఫరా
- బిల్లులు కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- ఇబ్బందులు పడుతున్న పరిస్థితి
- బకాయిలు ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి




శంకరయ్య తయారు చేసిన మట్టి వినాయక ప్రతిమలు

కొల్చారం(నర్సాపూర్): వినాయక చవితి వస్తుందంటే పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మట్టి వినాయక విగ్రహాలను పూజించాలంటూ పర్యావరణవేత్తలు, అధికారులు చెబుతుంటారు. కానీ మట్టి విగ్రహాలను తయారు చేసి, అమ్మేవారిని మాత్రం అధికారులు ప్రోత్సహించకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. ఏడాది క్రితం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మట్టి వినాయక విగ్రహాలను గ్రామాలకు సరఫరా చేస్తే ఇప్పటికి బకాయిలు పెండింగ్‌లో ఉండటం పలు విమర్శలకు తావిస్తుంది.

మూడేళ్లవుతున్నా అందని సొమ్ము

కొల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన కుమ్మరి శంకరయ్య, పాపన్నపేట మండలం అబ్లాపూర్‌కు చెందిన కుమ్మరి బ్రహ్మానందం ఇద్దరూ కలిసి మట్టి వినాయక ప్రతిమలను మూడేళ్లుగా తయారు చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు వీటిని పూజించాలని ప్రచారం జరుగుతోంది. దీంతో తాము తయారు చేసే మట్టి ప్రతిమల తయారీ గురించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు ప్రతిమలు సరఫరా చేసే బాధ్యతలను అప్పగించారు. 2022 నుంచి గతేడాది వినాయక చవితి వరకు జిల్లాలోని 79 గ్రామపంచాయతీలకు 8,290 ప్రతిమలను అందజేశారు. ఇప్పటికి వీరికి ఇవ్వాల్సిన వీటి తయారీ, రవాణా ఖర్చులు చెల్లించకుండా డీపీఓ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. దీంతో తీవ్ర నిరాశ, నిస్పృహకు లోనవుతున్నారు. డబ్బుల కోసం ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకున్నా అకౌంట్లో జమ చేయడం లేదని వాపోయారు. ఈ విషయంలో కలెక్టర్ స్పందించి బకాయిలు ఇప్పించాలని కోరుతున్నారు.

బకాయిలు ఇప్పించాలి



వ్యయ ప్రయాసాలకోర్చి చెరువు నుంచి నల్లమట్టిని తీసుకువచ్చి ఇంటిల్లిపాది రెక్కలు ముక్కలయేలా ప్రతిమలను తయారు చేసి జిల్లాలోని గ్రామాలకు సొంత ఖర్చులతో అందించాం. మూడేళ్లు అవుతున్నా ఇప్పటికీ మాకు రావలసిన డబ్బులు ఇవ్వడం లేదు. ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకున్నా అకౌంట్లో డబ్బులు వేస్తామని చెప్పడం తప్ప వేసింది లేదు. కలెక్టర్ సారూ.. ఈ విషయంలో స్పందించి డబ్బులు ఇప్పించాలి.

– శంకరయ్య, పైతర, కొల్చారం మండలం

క్లుప్తంగా

క్యూలైన్‌లో రాజన్న భక్తురాలు మృతి

● సిద్దిపేట జిల్లావాసిగా గుర్తింపు


విజయ (ఫైల్‌)

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన భక్తురాలు కొత్తకొండ విజయ(50) గురువారం మృతి చెందారు. స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్తుండగా కుప్పకూలిపోవడంతో వెంటనే బంధువులు వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విజయ రాజన్న దర్శనం కోసం కుటుంబ సమేతంగా వచ్చామని చెబుతున్నారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చోటపల్లికి చెందిన మహిళగా గుర్తించారు. బంధువులు విజయ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

మృతదేహం లభ్యం

● చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు


సురేశ్‌(ఫైల్‌)

కొడిపల్లి(నర్సాపూర్‌): చేపలు పట్టడానికి వెళ్లి చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. కొడిపల్లి బతుకమ్మతండాకు చెందిన మెగావత్‌ సురేశ్‌ (35) మంగళవారం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన విషయం విధితమే. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి పర్యవేక్షణలో రెండు రోజులుగా నర్సాపూర్‌ స్టేషన్‌ ఫైర్‌ ఆఫీసర్‌ ప్రశాంత్‌ సిబ్బందితోపాటు స్థానిక మత్స్యకారులు చెరువులో వెతికారు. గురువారం నాచారం నుంచి వచ్చిన గజ ఈతగాళ్లు, ఫైర్‌ సిబ్బంది చెరువులో వెతకగా ముళ్ల పొద వద్ద వలలో చిక్కుకున్న మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌ రెడ్డి తెలిపారు.

రోడ్డుపై చెత్త వేసినందుకు రూ.3 వేలు జరిమాన

సంగారెడ్డి : ఆరు బయట చెత్త పారబోసినందుకు మున్సిపల్‌ అధికారులు జరిమాన విధించారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని కల్వకుంట రోడ్డులో ట్రైనీ కలెక్టర్‌ మనోజ్‌, కమిషనర్‌ ప్రసాద్‌ చౌవాన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారబోసిన ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున మొత్తం రూ.9 వేలు జరిమాన విధించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే జరిమాన విధిస్తామని హెచ్చరించారు. ప్రతీ ఒక్కరూ పారిశుధ్య నిబంధనలు పాటించాలన్నారు.

ప్రమాదవశాత్తు కాల్వలో పడి వ్యక్తి మృతి

పటాన్‌చెరుటౌన్‌: కాల్వలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన బీడీఎల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన భిక్షపతి (60) బుధవారం గ్రామంలోని కాల్వ వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గురువారం మృతదేహాన్ని బయటకు తీయించి కేసు నమోదు చేసుకున్నారు.

నేడు దిశా కమిటీ సమావేశం

మెదక్‌ కలెక్టరేట్‌: నేడు మెదక్‌ కలెక్టరేట్‌లో దిశా కమిటీ సమావేశం జరుగుతోందని డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు దిశా కమిటీ కన్వీనర్‌ కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి మెదక్‌ ఎంపీ రఘునందన్‌ హాజరవుతున్నట్లు తెలిపారు.

గణపయ్యా.. రావయ్యా

- ముస్తాబైన గణనాథులు
- ఆకర్షణీయంగా విగ్రహాలు
- రంజోల్‌లో పెద్ద ఎత్తున తయారీ
- రూపం, సైజు బట్టి ధరలు
- ప్రారంభమైన కొనుగోళ్లు


వినాయక విగ్రహాలను పరిశీలిస్తున్న మండపాల నిర్వాహకులు

జహీరాబాద్‌ టౌన్‌: వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా గణనాథులు ముస్తాబయ్యాయి. ఈ క్రమంలో మార్కెట్‌లో విగ్రహాలకు భారీ ధరలు పలుకుతున్నాయి. జహీరాబాద్‌ ప్రాంతంలోని రంజోల్‌ వద్ద రాజస్థానీలు పెద్ద ఎత్తున విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నారు. విగ్రహాల సైజు, రూపం బట్టి ధరలు నిర్ణయించి అమ్ముతున్నారు. ఇక తొమ్మిది రోజులపాటు ప్రధాన కూడళ్లు, ఖాళీ ప్రదేశాల్లో నిర్వాహకులు మండపాలను ఏర్పాటు చేసి గణేశ్‌ విగ్రహాలను ప్రతిష్ఠించి నవరాత్రులు పూజలు నిర్వహిస్తారు.

జహీరాబాద్‌ పట్టణంతో పాటు గ్రామాల్లో గణేశ్‌ విగ్రహాలకు గిరాకీ పెరిగింది. జహీరాబాద్‌ రంజోల్‌ వద్ద 3 నుంచి 15 అడుగుల విగ్రహాలను తయారు చేస్తున్నారు. రూ. 5 వేల నుంచి రూ. 50 వేల వరకు ధరలు పలుకుతున్నాయి. రంజోల్‌ సుమారు ఐదారు ఖార్ఖాలను ఉండగా ఒక్కో దాంట్లో సుమారు 150కి పైగా విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇక్కడ తయారైన విగ్రహాలు పొరుగున ఉన్న కర్నాటక, మహారాష్ట్రాల మండపాల నిర్వాహకులు తీసుకెళ్తుంటారు. ఆర్డర్లపై కోరిన సైజులో విగ్రహాలను తయారు చేసి ఇస్తారు.

పీవోపీతో విగ్రహాల తయారీ

రాజస్థానీ కళాకారులు విగ్రహాల తయారీకి పెట్టింది పేరు. కుటుంబ సభ్యులంతా సుమారు 10 నెలలపాటు విగ్రహాలను తయారు చేస్తుంటారు. పీవోపీతోనే విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తారు. ఇంటిల్లిపాది పనులు చేస్తుంటారు. కొందరు విగ్రహాలను తయారు చేస్తుంటే మహిళలు, పిల్లలు రంగులు దిద్దతుంటారు. రెండు రోజుల్లో వినాయక చవితి పండుగ ఉన్నందున కొనుగోళ్ల సందడి షురూ అయింది. నచ్చిన విగ్రహాలను ముందుగా బుక్‌ చేసుకుంటున్నారు.


వాహనంలో వినాయకుడిని తరలింపు

డిమాండ్‌ బాగా ఉంది



వినాయక విగ్రహాలకు ఈసారి డిమాండ్‌ పెరిగింది. నెల రోజుల ముందు నుంచే అమ్మకాలు షురు అయ్యాయి. ఈసారి పూణే, ముంబాయి తరహా కొత్త మోడల్స్‌ తయారు చేశాం. వీటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాతోపాటు కర్నాటక రాష్ట్రంలోని బీదర్‌, ఉమ్నబాద్‌, బాల్కి తదితర ప్రాంతాల ప్రజలు కూడా వస్తున్నారు. వినాయక విగ్రహాల తయారీ ఖర్చులు పెరిగాయి. అందువల్ల ఆశించిన మేర లాభాలు రావడం లేదు.

– ఎం.జనార్దన్‌, తయారీదారుడు

పెద్ద విగ్రహాలు దొరకడం లేదు



పర్యావరణ పరిరక్షణ కోసం తాము ప్రాధాన్యత ఇవ్వాలని మాకు ఉంది. మట్టి విగ్రహాల కోసం చాలా చోట్ల వెతికాం. చిన్న చిన్న విగ్రహాలే తప్ప ఎక్కడ పెద్ద విగ్రహాలు లభించలేదు. పెద్ద విగ్రహాలు ఉంటే కొనేవాళ్లం. ఇక తప్పనిసరై ప్లాస్టర్‌ ఆఫ్‌ పారీస్‌ విగ్రహాన్ని తీసుకున్నాం.

– రాజు, యువకుడు, మెదక్‌

రంగుల విగ్రహాలే కొంటున్నారు



రెండేళ్లుగా మెదక్‌ జిల్లా కేంద్రంలో మట్టి విగ్రహాలను అమ్ముతున్నాం. ఆశించిన స్థాయిలో ఆదరణలేదు. అంతా రంగులమయంగా ఉండే ప్లాస్టర్‌ ఆఫ్‌ పారీస్‌ విగ్రహాలనే కొనుగోలు చేస్తున్నారు. మట్టి విగ్రహాలతో పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– దుర్గాప్రసాద్‌, విక్రయదారుడు

మట్టి గణపతికి తగ్గిన క్రేజ్‌

మెదక్‌ మున్సిపాలిటీ: జిల్లాలో వినాయక చవితి కోలాహలం మొదలైంది. ప్రతీ గల్లీలో ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున వినాయకుడి ప్రతిమలను ప్రతిష్టిస్తారు. నిర్వాహకులు మండపాలను సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ప్రతీ జిల్లాలో ఉత్సవ కమిటీలు తమ ప్రత్యేకతను చాటుకునేందుకు భారీ విగ్రహాలతోపాటు వినూత్న రీతిలో అలంకరణలు చేసి అందరినీ ఆకట్టుకుంటారు. ప్లాస్టర్‌ ఆఫ్‌ పారీస్‌తో తయారు చేసే విగ్రహాలను చెరువుల్లో, కుంటల్లో, కాల్వల్లో, నదుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి కాలుష్యం ఏర్పడుతుందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. వాటిని తగ్గించి మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలని సూచనలు చేస్తున్నారు.

యువతలో మార్పు

పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకొని యువత మట్టి విగ్రహాల ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నారు. గతంలో విగ్రహాల ఏర్పాటుపై ఎన్ని ఆరోపణలు వచ్చిన ప్రజల్లో మార్పు కనిపించేది కాదు. కానీ ప్రస్తుతం ఏర్పడుతున్న గాలి, నీటి కాలుష్యం వల్ల మార్పు మొదలైంది. యువతను ఆకట్టుకునే స్థాయిలో మట్టి విగ్రహాలు లభించడం లేదు. దీంతో తప్పనిసరై అదే ప్లాస్టర్‌ ఆఫ్‌ పారీస్‌తో రూపొందించిన విగ్రహాల వైపు మొగ్గుచూపుతున్నారు.


మెదక్‌ జిల్లా కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మట్టి వినాయక విగ్రహాలు

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా..

- ఏడు జిల్లాల్లో చోరీలు
- పోలీసుల అదుపులో దొంగ

కొండాపూర్‌(సంగారెడ్డి): తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని సీసీఎస్‌ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం కొండాపూర్‌ సీఐ చంద్రయ్య విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నల్గొండ జిల్లా హుజూరాబాద్‌ మండలం కరక్కాయల గూడెంకి చెందిన సన్నిధి ఆంజనేయులు వృత్తి రీత్యా తాపీ మేస్త్రీ. జల్సాలకు అలవాటు పడి దొంగతనాలను ప్రవృత్తిగా చేసుకున్నాడు. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నాడు. బుధవారం రాత్రి సీసీఎస్‌ పోలీసులు మల్కాపూర్‌ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఆంజనేయులు అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా చేసిన దొంగతనాలు ఒప్పుకున్నాడు. ఇప్పటి వరకు నల్గొండ, సూర్యాపేట, వరంగల్‌, ఖమ్మం, వికారాబాద్‌, మెదక్‌, సంగారెడ్డి జిల్లాల్లో చోరీలకు పాల్పడ్డాడని, 30 కేసుల్లో నిందితుడిగా ఉండగా, ఇటీవలె వికారాబాద్‌లో అరెస్ట్‌ అయ్యి జైలు జీవితం గడిపి మే 10వ తేదీన విడుదలయ్యాడని తెలిపారు. నిందితుడిపై 39 తులాల బంగారం, 189 తులాల వెండి, 2 బైక్‌లతోపాటు రూ.9.50 లక్షల నగదును అపహరించినట్లు కేసులు నమోదయ్యాయని వివరించారు. ప్రస్తుతం 15 తులాల బంగారం స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులకు సీఐ రివార్డులను అందజేశారు. సమావేశంలో సీసీఎస్‌ ఎస్సై శ్రీకాంత్‌, కొండాపూర్‌, మునిపల్లి ఎస్సైలు హరిశంకర్‌ గౌడ్‌, రాజేశ్‌ నాయక్‌తో పాటు పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చంద్రయ్య

నా కోసం వెతకొద్దని లేఖ రాసిపెట్టి..

● పదో తరగతి విద్యార్థి అదృశ్యం


సత్యనారాయణ మూర్తి

పటాన్‌చెరు టౌన్‌: విద్యార్థి అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అనకాపల్లి జిల్లాకు చెందిన సత్యనారాయణ మూర్తి(16) అమీన్‌పూర్‌ మండలంలోని హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీలో ఉంటున్న తన బాబాయ్‌ అప్పారావు వద్ద ఉంటూ ఓ ప్రైవేట్‌ స్కూల్‌లో చదువుకుంటున్నాడు. గురువారం మధ్యాహ్నం తన బట్టలు, సైకిలు, రూ.800 తీసుకొని ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. బాలుడి బాబాయి వెతుకుతుండగా ఇంట్లో ఒక లేఖ లభించింది. అందులో 'తాను సరిగా చదవడం లేదని, నా వల్ల ఇబ్బంది పడొద్దని అందుకే వెళ్లిపోతున్నానని నా కోసం వెతకొద్దని రాసి ఉంది.' బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బాలుడి అదృశ్యంపై బాబాయ్‌ అప్పారావు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఫోన్‌ కొనేందుకు వెళ్లి వ్యక్తి..


సుధాకర్‌ (ఫైల్‌)

వ్యక్తి అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌ పట్టణంలోని ఎన్టీఆర్‌ నగర్‌ కాలనీలో నివాసం ఉంటున్న సుధాకర్‌(27) డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జూన్‌ 17వ తేదీ ఉదయం ఫోన్‌ కొనేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు కొద్ది రోజుల నుంచి తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతుకుతున్నా ఆచూకీ లభించలేదు. భర్త అదృశ్యంపై భార్య జానకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటోను ఢీకొన్న కారు

● ఇద్దరికి తీవ్ర గాయాలు


బోల్తా పడిన ఆటో

హత్నూర(సంగారెడ్డి): ఆటోను కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హత్నూర మండలంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మెదక్‌ జిల్లా టేక్మాల్‌ మండలం సాలాజిపల్లి గ్రామానికి చెందిన వేముల సాయిలు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. రేగోడు మండలం ఇటికేపల్లి గ్రామానికి చెందిన బంధువులు పొట్టి లక్ష్మీ, పులబోయిన విత్తమ్మ, భవానీ, వర్షితను పటాన్‌చెరు మండలం కిష్టారెడ్డిపేటకు ఆటోలో తీసుకెళ్తున్నాడు. మార్గమధ్యలో హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామ శివారులోకి రాగానే పటాన్‌చెరు నుంచి నర్సాపూర్‌ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడి డ్రైవర్‌ సాయిలు, పొట్టి లక్ష్మీకి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. బాధితులు ఫిర్యాదు ఇవ్వలేదని పోలీసులు పేర్కొన్నారు.

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

● బైక్‌ను తప్పించబోయి రోడ్డు కిందికి..


రోడ్డు కిందికి దూసుకెళ్లిన బస్సు

హత్నూర(సంగారెడ్డి): అదుపుతప్పి ఆర్టీసీ బస్సు రోడ్డు కిందికి దూసుకుపోయిన ఘటన హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామ శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్‌ కథనం మేరకు.. హత్నూర మండలం నాగారం గ్రామానికి చెందిన నవీన్‌ దౌల్తాబాద్‌ నుంచి బైక్‌ పై ఇంటికి వెళ్తున్నారు. వడ్డేపల్లి గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై మట్టి ముద్దలు పడి ఉండటంతో బైక్‌ అదుపుతప్పి నవీన్‌ కింద పడిపోయాడు. అదే సమయంలో దౌల్తాబాద్‌ నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు నవీన్‌ను తప్పించబోయి రోడ్డు కిందికి దూసుకుపోయింది. ఈ సమయంలో బస్సులో సుమారు 35 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎవరికి ఏమి కాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

గురుకులాల గెస్ట్‌ లెక్చరర్స్‌ను విధుల్లోకి తీసుకోవాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్‌ : గురుకులాల్లో తొలగించిన గెస్ట్‌ లెక్చరర్స్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కేవీపీఎస్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్‌ చేశారు. గురువారం సంగారెడ్డిలో కేవీపీఎస్‌ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ గురుకులాల్లో గెస్ట్‌ లెక్చరర్స్‌ ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు బోధన చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారిని ప్రభుత్వం హఠాత్తుగా తొలగిస్తే ఎలా అని ప్రశ్నించారు? విద్యా సంవత్సరం మధ్యలో లెక్చరర్స్‌ ను తొలగించడంతో విద్యార్థులు సైతం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థుల చదువులకు నష్ట జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కేవీపీఎస్‌ జిల్లా కార్యదర్శి అశోక్‌ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్‌, సుభాష్‌ జిల్లా కమిటీ సభ్యులు దత్తు, చంద్రశేఖర్‌, మహేశ్‌, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్యం

● తుమ్మికూరకు డిమాండ్‌

వినాయక చవితి పండుగ రోజు తప్పకుండా వండుకునే కూరల్లో తుమ్మికూర ఒకటి. కొన్నేళ్లుగా పెరిగిన సాగు విస్తీర్ణం, పంటలకు రకరకాల మందులు వాడకంతో గ్రామీణ ప్రాంతాల్లో లభించడం గగనంగా మారింది. దీంతో కొందరు సుదూర ప్రాంతాలకు వెళ్లి తీసుకు వచ్చి అమ్ముతున్నారు. దీంతో కూరకు డిమాండ్‌ బాగా పెరిగింది. పిడికెడు కూర 30 నుంచి 50 రూపాయల వరకు విక్రయిస్తున్నారు.

– కౌల్చారం(నర్సాపూర్‌)



సొంత భవనాలు నిర్మించాలి

యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి

సంగారెడ్డి ఎడ్యుకేషన్‌ : జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న కాలేజీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి డిమాండ్‌ చేశారు. గురువారం సంగారెడ్డిలో బీసీ కళాశాల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. కళాశాల వసతి గృహం అద్దె భవనంలో ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారన్నారు. అకాల వర్షాలతో హాస్టల్లోకి గోడలు, స్లాబ్‌ పెచ్చులూడుతున్నాయన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టల్స్‌ని తక్షణమే ప్రభుత్వ అధికారులు సందర్శించి సొంత భవనాల పనులను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు, మహేశ్‌, శ్రీకాంత్‌, రాజేశ్‌, శేఖర్‌ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


హాస్టల్‌ను పరిశీలిస్తున్న రవి

అమెరికాలో అమీన్‌పూర్‌ వాసి మృతి

- రోడ్డు ప్రమాదంలో కారు దగ్ధం
- గుర్తుపట్టలేనంతగా ఫరూక్‌ మృతదేహం
- తల్లిదండ్రుల డీఎన్‌ఏ సేకరణ
- టెస్టుల తర్వాత స్వదేశానికి..

పటాన్‌చెరు టౌన్‌: అమెరికాలోని టెక్సాస్‌ రాష్ట్రంలో గత శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అమీన్‌పూర్‌ వాసి మృతి చెందాడు. కారు దగ్ధం కాగా నలుగురు మృతిచెందారు. మృతదేహాలు గుర్తు పట్టలేనంతగా ఉండగా గుర్తింపు కార్డు ఆధారంగా వారిలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని అమీన్‌పూర్‌ వాసిగా గుర్తించారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అమీన్‌పూర్‌ పరిధిలోని రాఘవేంద్ర నగర్‌ కాలనీకి చెందిన ఫరూక్‌ షేక్‌(28) మూడేళ్ల క్రితం అమెరికాలోని అన్నాస్‌లో నివాసముంటున్నాడు. యూ–వరల్డ్‌ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేస్తూ ఎంఎస్‌ కూడా పూర్తి చేశారు. కాగా ప్రమాదంలో అతని మృతదేహం గుర్తుపట్టలేనంతగా ఉండగా, స్వదేశానికి పంపేందుకు గాను ఫరూక్‌ తండ్రి షేక్‌ మస్తాన్‌వలి, తల్లి డీఎన్‌ఏ శాంపుల్స్‌ను గురువారం పోలీసుల సమక్షంలో వైద్యులు సేకరించారు. వీటిని అమీన్‌పూర్‌ పోలీసులు ద్వారా అమెరికాకు కొరియర్‌ చేయనున్నారు. ఇక్కడ డీఎన్‌ఏ టెస్టుల అనంతరం మృతదేహాన్ని పంపనున్నారు. ఈ విషయమై విలేకరులతో మాట్లాడేందుకు ఫరూక్‌ తల్లిదండ్రులు నిరాకరించారు.

‘ఇన్‌స్పైర్‌’ చేయడం లేదా?

ప్రాజెక్ట్‌ల తయారీపై ఆసక్తి చూపని విద్యార్థులు

- ఇప్పటి వరకు 500లోపే ఆన్‌లైన్‌లో నమోదు
- సిద్ధం చేయడంలో ఉపాధ్యాయులు వెనుకడుగు
- జిల్లా వ్యాప్తంగా లక్ష్యం 2,605
- సెప్టెంబర్‌ 15 వరకు చివరి గడువు

హత్నూర (సంగారెడ్డి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారిని భావిభారత శాస్త్రవేత్తలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతీయేటా 'ఇన్‌స్పైర్‌' మనక్‌ పేరిట పోటీలను నిర్వహిస్తుంది. ఈ పోటీల్లో ఆరు నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొంటారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారం అందిస్తారు. అలాగే, జాతీయ స్థాయిలో సత్తాచాటితే రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం అందజేస్తారు. ఈ పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయడంలో ఉపాధ్యాయులు కొంత వెనుకబడ్డారు. ప్రతీ సంవత్సరం 'ఇన్‌స్పైర్‌ మనక్‌' పోటీలకు ఆసక్తి చూపేందుకు చాలా మంది ప్రైవేట్‌ పాఠశాలల ఉపాధ్యాయులు ఇష్టపడడం లేదు. ఈ ఏడాది చాలా తక్కువ సంఖ్యలో ప్రాజెక్టులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

జిల్లా వ్యాప్తంగా 2,605 ప్రాజెక్ట్‌లు లక్ష్యం

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్‌, ఎయిడెడ్‌, గురుకుల, మోడల్‌, కస్తూర్బా పాఠశాలలు 521 ఉన్నాయి. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. ఒక్కో పాఠశాల నుంచి కచ్చితంగా 5 ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఇందుకుగాను 2,605 ప్రాజెక్టులు జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. గడువు సమీపిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు 500 ప్రాజెక్టులు కూడా దాటలేదు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు ఆసక్తి చూపిస్తున్నప్పటికీ ప్రైవేట్‌ పాఠశాలలో సైన్స్‌ ఉపాధ్యాయులు ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదని అధికారులు చెబుతున్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను నిపుణుల కమిటీ పరిశీలించి జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తుంది. ఇలా ఎంపికైన ఒక్కో ప్రాజెక్టుకు రూ.10 వేల చొప్పున ప్రోత్సాహం విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమ చేయబడుతుంది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిస్తే రూ.25 వేలు, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిస్తే రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటారు.


గతేడాది జాతీయ స్థాయికి ఎంపికైన కోహీర్‌ విద్యార్థి ప్రాజెక్టు (ఫైల్‌)

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



ప్రతీ పాఠశాల నుంచి కనీసం 5 ప్రయోగాల చొప్పున 'ఇన్‌స్పైర్‌ మనక్‌' పోటీలకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. ఇప్పటికే ఏ ఏ అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రయోగాలు చేయాలనే విషయాలపై ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇప్పించాం. నిర్లక్ష్యం వహించిన పాఠశాలలపై చర్యలుతీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి

భూ వివాదంలో మాజీ సర్పంచ్‌ దంపతులపై కేసు

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): భూ వివాదంలో మాజీ సర్పంచ్‌ దంపతులపై కేసు నమోదయ్యింది. ఎస్‌ఐ అభిలాష్‌ కథనం మేరకు.. మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన కొరుట్ల కొమరవ్వ అనే మహిళకు గ్రామంలోని పలు సర్వే నంబర్లలో ఎకరా భూమి ఉంది. ఇందులో మూడు గుంటల్లో ఉన్న పాత ఇంటిని మాజీ సర్పంచ్‌ వకుళాభరణ భానుప్రకాశ్‌కి గతంలోనే అమ్మినట్లు నాన్‌ జ్యుడిషియల్‌ పేపర్‌ ద్వారా రాసి ఇచ్చింది. ఈ క్రమంలో భాను ప్రకాశ్‌ పట్టా భూమిని తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి కొమరవ్వకు చెందిన నాలుగున్నర గుంటలు అదనంగా ఆక్రమించుకున్నాడు. ఈ విషయంపై భానుప్రకాశ్‌తోపాటు అతడి భార్య మాజీ ఎంపీటీసీ మాధవి మాకు భూమి హద్దులు చూపించకపోతే చంపుతానని బెదిరించారు. గతంలోనే బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా గురువారం ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.